కథా నిలయం
శ్రీకాకుళం

# పిన్ని

పిన్ని చాలా మంచిది. పిన్నిలోని మంచిగుణమే సహం అన్నయ్యా చెడిపోటానికి హేతువు. పిన్ని కావటానికి సవతి తల్లే అయినా ఆమెకు తన పిల్లలమీదకంటెకూడా అన్నయ్యమీదా, తనమీదా మహాయిష్టం. ఆ ప్రేమ అంత నిర్మలంగా వుండటానికీ, ఆ అభిమానం అంత అధికముగా వుండటానికీ కారణాలు తనకైతే తెలీదు. కాని, యేమన్నా అన్నయ్యకు తెలుసునేమో? సవతితల్లిలో సహజంగా అసూయ, ద్వేషం, తన సంతానంమీద అమితమైన మక్కువా, వుంటుందనే వాదాలనే తను అక్కడక్కడా సహజంగా సవతితల్లుల మనోభిప్రాయాలూ, ఆచరణా, నైజాలను విన్నది. కాని తన పిన్ని ఈ రకానికి చెందినది కాదు.

ముఖ్యంగా పిన్నిలో తను, ఒక ఆశయాన్ని నైపుణ్యంగా కనిపెట్టగలిగింది. బహుశా ఆ ఆశయంవల్లనే తనమీద, అన్నయ్యమీద పిన్నికి యింత గొప్ప అభిమానం కలగవొచ్చు. తను సవతి పిల్లలపట్ల అధికమైన ప్రేమను ప్రకటించి, లోకంయెడ మంచి పేరును సంపాదించవచ్చునని, ఈ ఆశయం పిన్ని హృదయంలో లేకపోవచ్చు కాని, యిట్లా తలంచక తప్పదు. ఒకవేళ, నాన్న పిన్నిని తన మొదటిభార్యకు పుట్టిన యిద్దరు పిల్లల్ని సక్రమమైన పోషణలో పెంచటానికి రెండో పెళ్ళి చేసుకున్నాడు కనుక, ఆ అభిప్రాయం సులభగ్రాహియై పిన్ని గ్రహించి, సవతి పిల్లలపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవచ్చు. కాని నాన్న అప్పుడు

రెండో భార్యకు పిల్లలు పుడతారని ఊహించాడా? మరి పిన్నికి యిద్దరు పుట్టారుగా? యేమైనా తను పిన్ని యింగితాన్ని సరైన పంథాలో గ్రహించలేదు. గ్రహించటానికి ప్రయత్నించటం కూడా సబబుగా వుండకపోవచ్చు.

తనకు మూడేళ్ళు, అన్నయ్యకు అయిదేళ్ళు. అప్పుడు పిన్ని కాపరానికి వొచ్చింది. నాన్నకు తెనాలిలో హైస్కూలు టీచరు వుద్యోగం. కుటుంబం అక్కడే—అద్దెకొంపలో నివాసం. అప్పట్నుంచీ తననూ, అన్నయ్యనూ చాల మక్కువగా చూసింది పిన్ని. రెండు పూటలూ కొన్న పెరుగు తను వేసుకోకుండా పిన్ని నాన్నకీ, అన్నయ్యకీ తనకూ వేసేది. అడిగిని చిరుతిళ్ళన్నీ వేరుశనక్కాయల దగ్గర్నుంచీ, పీచుమిఠాయి పంచదార లడ్లు వరకూ కొనిపెట్టేది. నిత్యం రెండు పూటలూ స్నానాలు చేయించి కొత్తగుడ్డలు కట్టేది. తనకు అక్షరాలు దిద్దబెట్టి, అన్నయ్యకు మూడవ తరగతి పుస్తకం పట్టించి, చదివింపజేసేది. తనూ, అన్నయ్యా అమ్మ చనిపోయింది సరిగ్గా యెరగరు కానీ, పిన్నినే అమ్మ అని పిలవటం, నిజంగా అపోహ పడటం జరిగింది. అప్పుడప్పుడూ పిన్ని 'పిన్నీ' అని అనమని అనేది. కానీ, అన్నయ్య 'నువ్వు పిన్నివి కావు, అమ్మవి' అనేవాడు. తను పిన్ని అనే పిలిచేది. బొమ్మలు కొనిపెట్టి ఆటలు ఆడించటం లోనూ, ముసలమ్మల కథలు చెప్పి 'ఊఁ!' కొట్టించటంలోనూ, రాక్షసుల కథలు చెప్పి భయపెట్టించి, 'అమ్మో!' అనిపించటం లోనూ, పిల్లల కథలు చెప్పి, మాయమాటలు లాలించి చెప్పి, తాయం పెడతానని ఆబలు రేకెత్తించి బడికి పంపటంలోనూ పిన్ని బహునేర్పును వుపయోగించి అన్నయ్యనూ, తననూ వుత్సాహపరచేది. తెనాలిలో వుండగానే పిన్నికి పాపాయి

పుట్టాడు. అంటే తనకూ అన్నయ్యకూ తమ్ముడు. ఈ విషయం పిన్ని అప్పుడే చెప్పింది. అయిదు సంవత్సరాలు గడిచాయి. నాన్నను తెనాలినుంచి బదిలీ చేశారు గుంటూరుకు. స్వగ్రామా నికి బదిలీ చేయించుకోవాలని నాన్న చాల అవస్థలు పడ్డాడు కానీ యేమీ కొనసాగలేదు. మళ్ళీ కాపరం గుంటూరులో పెట్ట వలసి వొచ్చింది.

నాన్న అన్నయ్యకి ట్యూషన్ చెప్పి హైస్కూల్లో చేర్పిం చాడు. తను మూడోక్లాసు పుస్తకం చదవగల్గుతున్నది. తమ్ముడు సుదర్శనానికి గుంటూరు వొచ్చాక శీతోష్ణస్థితి సరిపడక వరసాగ్గా వారంరోజులు తీవ్రమైన జ్వరం తగిలి బక్కచిక్కిపోయాడు. తిరిగి కోలుకోటానికి నెల పట్టింది.

కొడుకు పుట్టిం తరువాతకూడా పిన్నికి అన్నయ్యమీదా, తనమీదా ప్రేమ తగ్గలేదు. మామూలు చిరుతిండీ, మీగడ పెరుగూ, చారెడు నేయీ వేసి పెడుతుంది. అయితే యేం? నాన్న తరుచుగా పిన్నితో తగాయిదా పడుతున్నాడు. ఎందుకో మరి. చిరుతిండీ, మీగడపెరుగూ పిల్లలకు పెట్టవొద్దనీ, కొత్తచొక్కాలు మాటిమాటికీ తొడగవొద్దనీ షరతులు విధిం చాడు. తనకూ, అన్నయ్యకూ కోపంవేసి, పిన్నిని అడిగితే— డబ్బు ఖర్చు అవుతుందనీ, అందుకు నాన్న భయపడుతున్నా డనీ చెప్పింది. "యేం, డబ్బు ఖర్చు అయితేం?" అని తను అన్నది. పిన్ని నవ్వు నవ్వి తనని ముద్దుపెట్టుకొని — "నీకు తెలీదమ్మా! తాహతుకు మించిన డబ్బు ఖర్చు చేస్తే అప్పులపా లవుతాం! నీకూ, అన్నయ్యకూ పెళ్ళిళ్ళు కావు," అని అన్నది.

నాన్నకు ఉద్యోగంవల్ల వొచ్చే తొంభై రూపాయలు నెల రోజులు సంసారం గడిచేందుకు చాలడంలేదు. స్వగ్రామంలో

అయిదెకరాల పంటమీద వొచ్చే డబ్బును వాడుకోవాల్సి వొస్తున్నది. ముఖ్యవిషయ మేమిటంటే, నాన్న పిన్నికి కొన్ని అధికారాలు యిచ్చాడు. డబ్బు ఆమె వాడటమే. నెలజీతం తీసుకువొచ్చి నాన్న తనకు కావాల్సిన పదో పాతికో దగ్గర అట్టేపెట్టుకుని మిగిలింది పిన్నికి యిస్తాడు. రోజు ఖర్చులకు పిన్ని వీలైనంతవరకూ పొదుపుగానే వాడుతుంది. ఒక్కొక్కప్పుడు సినిమాలకూ, చిరుతిళ్ళకూ డబ్బులు ఇవ్వకపోతే, అన్నయ్య అలిగి, బడికి పోనని మారాము చేస్తే—పిన్ని కరుణించి ఒక్క పావలా యిస్తుంది.

పిన్ని సినిమాలు చూడదు. నాన్న సినిమాలు చూడమనడు. పైపెచ్చు పిల్లలకు సినిమాలకు మాటిమాటికీ డబ్బులు యివ్వొద్దని నాన్న పిన్నితో అనటం కూడా తను విన్నది. నాన్నకు ఎందుకో అంత ద్వేషం? పిన్ని సుందరం భార్యకుమల్లే కొత్తకొత్తచీరెలు, జాకెట్లు తొడుక్కోదు. మరి అన్నయ్యకీ, తనకీ, తమ్ముడికీ కొత్తకొత్త చొక్కాలు, లాగూలు కుట్టించి తొడుగుతుంది. నాన్నకూడా క్రొత్త దుస్తులు ధరించినట్లు ఎన్నడూ కనబడడు. ఆ మామూలు రోజూ తొడిగే గుడ్డలే. పిన్ని ఎందుకు తొడుక్కోమనదు? ఒకసారి తను చూస్తూండగానే చినిగిన నాన్న చొక్కాని పిన్ని దారంతో కుట్టి, సరిచేసి నాన్నని ధరించమని సలహా యిచ్చింది. నాన్న మారుమాట్లాడకుండానే ధరించాడు. పిన్నికి మంచి నగలు ఎందుకు నాన్న చేయించలేదో తను ఒకనాడు పిన్నిని ప్రశ్నించింది. పిన్ని నవ్వింది. అసలు పిన్ని ఎప్పుడూ చక్కగా నవ్వుతూనే వుంటుంది. ప్రయత్నించి ప్రత్యేకించి నవ్వకపోయినా పిన్నిముఖంలో నవ్వు ద్యోతక మవుతూనే వుంటుంది. నాన్న కోప్పడినప్పుడు,

అన్నయ్య డబ్బులు అడిగినప్పుడు, తమ్ముడు యేడుస్తున్నప్పుడు—పిన్ని నవ్వుతూనే సమాధానం చెబుతుంది. అప్పుడప్పుడూ తనకు కాకతాళీయంగా కొన్ని సందేహాలు కలుగుతుంటయ్. చనిపోయిన అమ్మనుగురించి–నిజంగా అప్పుడు అమ్మ పిన్నికిమల్లే బాగా వుండేదేనా? పిల్లలమీద యింత మమతగా వుండేదేనా?

గుంటూరు వొచ్చిన రెండు సంవత్సరాలకు పాప పుట్టింది. తను బడి మానేసి పాపను ఎత్తుకొనేది.

పిన్నికి ప్రొద్దున పదకొండు గంటలనుంచీ తీరిక. ఆ తీరిక సాయంత్రం 5 గంటలవరకూ, అంటే నాన్న స్కూలునుంచి వచ్చేవరకు. మధ్యాహ్నం కాఫీ కాయటం మినహాయించి, విశేషించి ఏమీ పనిలేదు. ఈ లోపల పిన్ని తనకూ, తమ్ముడికీ చదువు చెప్తుంది. తనకు చదువుకంటే పాపను ఆడించడమంటే మహాయిష్టం. అన్నయ్య చదువుమీదకూడా మంచి శ్రద్ధను చూపించేది పిన్ని. ఆటలకు వెళ్ళనిచ్చేది కాదు. రాత్రి పదిగంటల వరకూ చదవమని చెప్పటమేకాకుండా, చదువుతున్నాడో లేదో పరీక్షించేది. నాన్నకుకూడా అన్నయ్య చదువునుగురించి అంత శ్రద్ధలేదు. పరీక్షలటైములో రాత్రిపూట టీ కాచి అన్నయ్యకిచ్చి నిద్రపోకుండా ఎక్కువసేపు చదివేటట్లు చూసేది. తెల్లవారు ఝామున లేవకొట్టి, అన్నయ్య విసుక్కున్నా సహించి చదివించేది.

అన్నయ్య స్కూలుఫైనలు ప్యాసైనాడు ఆ సంవత్సరమే నాన్నకు బదిలీ అయింది స్వగ్రామానికి. అందరం సంతోషపడ్డాం. వెంటనే స్వగ్రామం చేరుకున్నాం.

ఇక అన్నయ్య ముందుచదువుగురించి సమస్య బయల్దేరింది.

"నేను కాలేజీలో చదవాల్సిందే నాన్నా," అన్నాడు అన్నయ్య.

"సరే! అది మంచిదేరా! కాని యేం చేస్తాం. కాలేజి చదువంటే మాటలా? ముందు చదివేవాడికన్నా ఇంటిదగ్గర చెప్పించేవాడి తాడు తెగుతుంది. ఒక్క ఇంటర్‌మీడియేట్ చదివి లాభం లేదాయె," అన్నాడు నాన్న.

తను వింటూ కూచుంది. తనకి, అన్నయ్య పెద్దచదువు చదవాలనే వుంది.

"యేం ఫరవాలేదు. చెప్పించవొచ్చు. యేమీ సెంటుపొలం లేనివాళ్ళు కొడుకులకు కాలేజీల్లో చదువు చెప్పిస్తున్నారు. అటువంటిది కాస్తోకూస్తో గడ్డ వున్నవాళ్ళు చెప్పించటం గొప్ప కాదు," అన్నాడు అన్నయ్య కాస్త రోషంగా.

"అదిగాదురా నే చెప్పేది. వీలుగావుంటే కాలేజీలో చదివేకంటే యేదో ఒక కోర్సు చదవటం మంచిది. ఇప్పుడు స్కూలు ఫైనలు చదివేవాడు సంపాదించేంత బి. ఏ. చదివినవాడు సంపాదించటం లేదు. అదీగాక ఈ కాలేజీలకు డబ్బును ధారపోయుటానికి వాస్తవానికి మనకు తాహతేదీ? ఎటొచ్చీ నే సంపాదించే జీతంతో కుటుంబం జరగటంలేదుగా? పంటమీద వొచ్చే ఆదాయం హరించుకుపోగా, పైచిలుకు కొద్దోగొప్పో అప్పు కూడా చేయవలసివస్తున్నది. అటువంటి పరిస్థితుల్లో నీ చదువుకని ప్రతిసంవత్సరం వెయ్యి రూపాయలు వ్యయపరచటం కుటుంబ ఆర్థికస్తోమతకు భంగకరం. పైగా పిల్లలుగల సంసారం. పెళ్ళిళ్ళు చేయుటము ఈకాలంలో అంత సులువుగా అయ్యేపని కాదు," అని చిన్న ఉపన్యాసం దంచివేశాడు నాన్న. అన్నయ్య యేమనలేకపోయాడు. మరీరోషంగా మాట్లాడితే అసలు వ్యవ

హారం చెడుతుంది.

అన్నయ్య పిన్నిసహాయం కోరాడు. నాన్న పిన్నిమాటలు తిరస్కరించడని అన్నయ్య అభిప్రాయం. పిన్ని మొదట్లో అన్నయ్యమాటను ఆలకించక, నాన్న చెప్పిందే సమంజసమైన పద్ధతి అని అన్నది. అన్నయ్యకి పిన్నిపట్ల కొంత చనువు వుంది. ఆ చనువుకొలదీ బ్రతిమిలాడి కొసకు కంటనీరు పెట్టుకున్నాడు. పిన్నికి జాలివేసింది. పిన్ని మనస్సు మరోవిధంగా కూడా లోకాన్ని చూసి భయపడింది. తనుకూడా అబ్బాయి చదువు విషయమై అడ్డుపెడితే లోకులు — తన సంతానంకోసమై సవతి తల్లి ఇట్లా భర్తచేత అడ్డుపెట్టించిందని అసూయను ఆపాదిస్తారని — ఇట్లా అపోహపడటం పిన్నిది కేవలం సబబు కాకపోవచ్చు కానీ, పిన్ని మనోదౌర్బల్యం అట్లా అపోహపడటానికి కారణమైంది.

పిన్ని నాన్నతో అన్నది ఆరాత్రి, అన్నం వడ్డించి.

"అబ్బాయి అంత కోరికపడి కాలేజీకి వెళ్ళాలని మనసు పడుతుంటే — మీరు అడ్డుచెప్పటం బావుండలేదు. నాదగ్గరకు వచ్చి వూరికే యిదయ్యాడు," అని.

పిన్నివంక అదోవిధంగా చూశాడు నాన్న. ఆ చూపులోని గూడార్థం తనకు అవగాహన కాలేదు. బహుశా పిన్నికి అవగాహన అయివుంటుంది. "ఫరవాలేదు, చెప్పించండి. అబ్బాయి జాగ్రత్తగా చదువుకొనేవాడు. అబ్బాయి చదువు వల్లనే మనం దరిద్రులంకాము," అని అన్నది పిన్ని. నాన్న మాట్లాడలేదు. ఎంగిలిచెయ్యి కడుక్కొని వంటయింట్లోకి వచ్చాడు. అన్నయ్య ఈ సంభాషణ చాటునవుండి విన్నాడు. ఆశ రేకెత్తింది.

ఆరాత్రి పిన్ని ఎట్లాగైతేనేం నాన్నను, అన్నయ్యని కాలేజీకి పంపించేటట్టు వొప్పించింది. పిన్ని సమర్థురాలు. అన్నయ్య ఉత్సాహాన్ని భంగపరచడం పిన్నికి మనస్సుతో చేయతగ్గపని కాదు.

* * *

అన్నయ్య విజయవాడ కాలేజీలో చేరాడు. నాన్న అద్దె గది మాట్లాడి, హోటలుభోజనం కుదిర్చి, పట్టణంలో వొంటరిగా మెలగి మనస్సును చెడుమార్గాల్లోకి త్రిప్పుకోకుండా, పదిల పరుచుకోవాలని ఒక ఉపన్యాసం చెప్పి, కాలేజీకి సక్రమంగా వెళ్ళటం, పిల్లల సహవాసం చెయ్యకుండావుండటం, చదువు కోవటం మినహాయించి మాటిమాటికీ సినిమాలు చూడటం వగైరా జరుగుతున్నట్టు తెలిస్తే కాలేజీచదువు మాన్పిస్తానని చెప్పి నాన్న యింటికి వొచ్చాడు. అయినా నాన్నకి మనస్సులో భయంగానే వుంది — వీడు సక్రమంగా కాలేజీకివెళ్ళి ఒంటరిగా చదువగలడా అనే విషయంలో.

అన్నయ్య లేకపోతే యిల్లంతా బావురు మంటున్నది. పది మంది పెట్టు. అది అనీ ఇది అనీ — పిన్నిని నవ్విస్తూ, పిల్లల్ని యేడ్పిస్తూ గోలచేసేవాడాయెను! తమ్ముడికీ, చెల్లెలికీ, అన్నయ్య లేకపోవటం లోపంగానే కనబడి ఒకసారి తనను అడిగారు.

"కాలేజీలో చదువుతున్నాడు," అన్నది తను.

చెల్లెలికి - కాలేజీలో అన్నయ్యే ఎందుకు చదవాలో అర్థం కాలేదు.

నాన్న విజయవాడ వెళ్ళాడు, అన్నయ్యను చూసి వొచ్చేందుకుగాను. అప్పటికి పదిహేను రోజులక్రితమే ఒకసారి వెళ్ళి

వొచ్చి పరిస్థితుల్ని తెలిసికొని తృప్తి పడ్డాడు. అయినా వేధవది కొడుకును గురించి వున్న తాపత్రయం మళ్ళా ప్రయాణం కట్టించింది. పిన్ని పంచదారలడ్లు, కారపుబూందీ ఆ రాత్రి వొండి తెల్లవారే సంచిలో పెట్టి నాన్న కిచ్చింది, అన్నయ్యకు అందచేయమని.

అన్నయ్య ప్రవర్తనమీద తనకూ పిన్నికీ ఒకేనమ్మకం వుంది. ఆ నమ్మకాన్ని తనలో పిన్ని చూడలేకపోతే చూడలేకపోవచ్చు. పిన్నిలో తను గాఢంగా గుర్తించింది. అన్నయ్య తన కుటుంబానికి యేవిధంగా ఎప్పుడూ ద్రోహం చెయ్యడనీ, చదువుకొని వుద్యోగం చేసి కుటుంబాన్ని ఉద్ధరిస్తాడనీ. ఇట్లా అభిప్రాయపడటానికి ప్రస్తుతం అన్నయ్య సత్ప్రవర్తనే కారణం అయినా, ముందుముందు కూడా దీనివల్లనే అన్నయ్య బాగుపడతాడు.

మరునాడు నాన్న తిరిగివొచ్చి అన్నయ్య ప్రవర్తననిగురించి సక్రమమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చటంచేత పిన్నీ, తనూ ఎక్కువ సంతోషపడ్డది యేమీలేదు. అయితే, నాన్న ఆదుర్దాకు నవ్వుకోక తప్పలేదు.

తను పెద్దమనిషయింది నాన్న, మనకు తాహతులేదు, పెద్ద బంతులు పెట్టలేమన్నాడు. పిన్ని మాట్లాడలేదు. ఆవిధంగానే బంధువులతో, కొద్దిమంది యిరుగుపొరుగు వాళ్ళతో బంతి గడిచిపోయింది. పిన్నికి పెద్దగా బంతి పెట్టాలనే వుంది కాని, స్థితిదగ్గరకు వచ్చేటప్పటికి కోర్కెల్ని చంపుకోవాల్సిన అగత్యం కలుగుతున్నది. అనకూడదుకాని పిన్ని యే ధనవంతుల యింటిలోనో వుంటే తాహతుకు తగ్గ పోకడలు పోయేది. అప్పుడు ఈ పిన్నిలోని శాంతం, ఉదారత్వం వుండేవా అన్నది సందేహాస్పదం

వేసవికాలపు శలవలకు అన్నయ్య యింటికి వొచ్చాడు. హోటలు భోజనం కావటంవల్ల నైతేనేం, చదువు ఎక్కువ చదవటంవల్లనేం అన్నయ్య చిక్కిపోయాడు. "ఆ చిక్కిపోయిన వార శలవుల్లో యింటిదగ్గరవుండి బలుద్దువుగానిలే," అని పిన్ని నవ్వింది. అన్నయ్య నవ్వాడు; కాదు, సిగ్గుపడ్డాడు. నెలకీ, నెలా పదిహేనురోజులకూ యింటికి వొచ్చినప్పుడు అన్నయ్య నాన్న దగ్గర ఖర్చులకు-జీతానికి తీసుకున్న డబ్బులు గాక పిన్నిదగ్గర నాన్నకుతెలియకుండా తీసికోనేవాడు. పిన్ని, దేనికి అబ్బాయీ డబ్బులూ ! అని అంటూనే పది, పదిహేనురూపాయలు యిచ్చేది. పిన్ని దగ్గర తన కున్న చనువుకొద్దీ అన్నయ్య అడగటం అన్నయ్యమీద పిన్నికున్న అభిమానంకొద్దీ యివ్వటమూ జరిగి పోతున్నది. ఆ అన్నయ్య అడగటమూ, పిన్ని యివ్వటమూ పదిహేనురూపాయల లోపలే.

ఈ మధ్యనే నాన్నకు ఒక విచారం అలముకొంది. అది తను పెద్దమనిషి కావటంతోనే యేర్పడింది. 'ఈ రోజుల్లో అడ పిల్లకు పెళ్ళి-అందులో మధ్యతరగతి కుంటుంబంలో చేయటం మహత్తరమైన బాధలతో కూడుకున్న పని,' అని నాన్న చాలామంది తండ్రులు అనుకొనేటట్లు అనుకోవడమే. తను పెద్దమనిషి అయి దాదాపు నాలుగైదు నెలలు కావొస్తూంది. ఇంతలోనే పెళ్ళినిగురించి ఎందుకో నాన్నకు విచారం ?

ఈ విషయమై పిన్నీ, నాన్నా తగాయిదాపడటం తను ఆల కించింది.

"అప్పుడే దానికి పెళ్ళి ఎందుకండీ ! ఏ గుడ్డ కొనబోయినా విపరీతమైన ధరలతో మండిపోతున్నాయి. మొన్న సమర్తబంతికి అయిన అప్పు-యింతకుముందు ఆయిన అప్పులంతా నిలబడి వడ్డీ

పెరుగుతూంటే, దాన్ని తీర్చుకొనే ఉపాయం ఆలోచించ వల సిందిపోయి యిట్లా పెళ్ళిని గురించి మధనపడటం దేనికండీ?" అని పిన్ని అన్నది.

"నీకు తెలియదులేవే! ఆడపిల్ల కనుక అల్లుడ్ని మనమే వెతుక్కోవాలి. అందులో మనం పిల్లకి కట్నంక్రింద యివ్వబో యేది పెద్దమొత్తంలో వుంటే - అల్లుడే మనల్ని వెతుక్కుంటూ వొస్తాడు. మనం యిచ్చేది ఏకొద్దోనాయె. అటువంటప్పుడు చేతులు ముడుచుక్కూచుంటే పెళ్ళి కాదు. పిల్లా - యెదిగి పోయి నలుగురిఎదుటా తలయెత్తుకొనే పనుండదు," అన్నాడు నాన్న ముందు ఆలోచన కలిగివున్న వాడివలె.

ఇంతత్వరలో పెళ్ళి చేసుకోవటంవల్ల యేమాట కామాటకు తనకే యిష్టంలేదు; మరీ తండ్రి నిర్బంధపెడితే తప్ప.

అయినా అటువంటి దేమీ జరగలేదు. నాన్న వెతికిన రెండు మూడుసంబంధాలూ పనికిరాలేదు - పిన్ని అభ్యంతరం చెప్ప టమువల్ల.

వేసనికాలపు శలవలు అయిపోవటంతో అన్నయ్య మళ్ళీ విజయవాడకు ప్రయాణం కట్టాడు. నాన్న రెండు వందలు అప్పు తెచ్చి అన్నయ్య చేతులో పెట్టి అన్నాడు.

ఈ డబ్బంతా నేను అప్పు తీసుకురావటమే జరుగుతూంది. ఏసంవత్సం పంట ఆ సంవత్సరం అప్పులకు ధారపోయగా యింకా ఒక ఒడ్డు కనపడక-అప్పు అంతో యింతో మిగలటమూ, వొచ్చే సంవత్సరానికి ఆ అప్పు వడ్డీతో సహా పెరిగి ద్విగుణీ కృతము కావటమూ జరుగుతున్నది. మన సంసారం మొద ట్నుంచీ కాస్త జాస్తిగా ఖర్చుపెట్టే నాగరికతలో పెరుగుతూ వొచ్చింది. కొన్ని అవసరాలు ధనభారంగా తగ్గించుకుందామని

మనస్సును కట్టుదిట్టం చేసినా, వెధవది హోదా అడ్డువచ్చి-ఖర్చును తగ్గించుకొనే వుపాయాన్ని నాశనం చేస్తుంది. ఇంతకూ చెప్ప నుపక్రమించింది యేమంటే, - నువ్వుకూడా సాధ్యమైనంతవరకూ పొదుపుగా వాడుకోమని. అంతే కాకుండా శ్రద్ధగా, తప్పకుండా ప్యాసు కావాలనే వుద్దేశ్యంతో చదవాలి. ఇప్పటి విద్యార్థుల్లో చదువుకోసం కాలేజీకి వొచ్చేవాళ్ళు చాలామంది తక్కువ. అటువంటివారితో నువ్వు స్నేహం చేస్తే - యిక మేము డబ్బు అప్పులు తెస్తూ నీ కివ్వటం, నీవు చదవటం వృధాకాకమానదు," అని.

"అటువంటి తెలివితక్కువ పనులు నే నెందుకు చేస్తాను నాన్నా ! మీరు చదివించే బాధ్యతని గుర్తించే సంస్కారం నాలో వుంది. నాగురించి మీరు విచారపడవద్దు," అన్నాడు అన్నయ్య.

"వాడిమీద ఎందుకూ మీకంత నమ్మకం లేకపోవడం ? యేమవుతాడనీ," అని నాన్న మీద పిన్ని అసహ్యపడింది.

అన్నయ్య విజయవాడ బండి కెళ్లాడు. నాన్న స్టేషను వరకూ వెళ్లాడు. అక్కడ కూడా యిటువంటి ఉపన్యాసమే బహుశా చెప్పివుంటాడు

నాన్న ముఖ్యంగా బడిపంతులు కావటము వలన, విద్యార్థుల యొక్క మనస్తత్వాలు ఎట్లా ఏ పరిస్థితుల్లో మారుతూ వుంటాయో తెలుసు. అందుచేత అన్నయ్యను అంత కనిపెట్టి వుంటున్నాడని తలచవచ్చు.

*　　*　　*

ఒక రోజు అర్ధరాత్రి తలుపు కొట్టినట్లుగా వుంటే పిన్ని లేచింది. గాలి అధికంగా లేకపోవటం మూలాన, దోమలు విపరీతంగా మోత బెడుతూ తారాడుతూండటంవల్ల తనకి నిద్ర

పట్టక మేలుకొనేవుంది తను. పిన్ని తలుపు తీసింది.

అన్నయ్య—లోపలకు వొచ్చాడు. పిన్నికీ తనకూ విపరీతమైన ఆశ్చర్యం వేసింది. అంత అర్ధరాత్రిన అన్నయ్య వొచ్చిన కారణం తెలీకపోవటం వలన వేసిన ఆశ్చర్యం కంటె — అన్నయ్య వున్న రూపం అధికమైన ఆశ్చర్యాన్ని కలిగించింది. నాన్న ప్రక్క గదిలో గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు.

"ఇంత అర్ధరాత్రి ఎందుకు వొచ్చావు?" అన్నది పిన్ని— ఏ విధంగానూ అర్థం చేసుకోలేకుండా.

అన్నయ్య చెమట తుడుచుకొని మంచంమీద కూర్చున్నాడు. "బండి లేటయింది," అన్నాడు.

"మొన్న నేగా వెళ్ళింది. పదిరోజులుకూడా కాలేదే? ఇంతలో ఇంటికి రావాల్సిన అవసరం యేం కలిగింది?" అని ప్రశ్నించింది పిన్ని

"పనివుండే వొచ్చాను," అన్నాడు అన్నయ్య.

"యేం పని?" అన్నది తను.

"డబ్బు కావాలి, ముఖ్యంగా. అందువల్లనే యింత రాత్రి రావాల్సివొచ్చింది. తెల్లవారితే కాలేజీ," అన్నాడు.

"డబ్బు దేనికీ? మొన్ననేగా రెండువందల రూపాయలు తీసికెళ్ళింది? ఎట్లా ఖర్చయినయి? ఇంత తొందరకాలంలో?" పిన్ని మనసులో వివిధములైన ఆలోచనలు కలిగినయ్ ఆ క్షణంలో.

"మొన్ననేగా తీసుకెళ్ళింది. రెండువందలు," అన్నది తను.

ఆ మాటకు అన్నయ్య కంటతడి పెట్టాడు. ఏదో ఉపద్రవం జరిగిందన్న విషయం పిన్నికీ, తనకూ సువ్యక్తమైంది.

"ఏం జరిగింది?"

మాట్లాడలేదు అన్నయ్య

పిన్ని మనసులో ఆలోచనలు వికృతరూపంలో చెలరేగు తున్నయ్.

"ఏం జరిగింది?"

"వందరూపాయలు జీతం కట్టాను. మిగిలిన వంద—" చెప్పజాలనన్నట్లు అన్నయ్య బాధపడ్డాడు.

"ఏమేం చేశావ్?" పిన్ని రెట్టించింది.

"ఏమేం చేయలేదు. నిన్నరాత్రి సినిమాకు వెళ్ళితే, రాత్రి పదిగంటలకు తిరిగి యింటికి వొచ్చేటప్పటికి, రూములో దొంగలు పడి—వందరూపాయలు కాజేశారు. ఈవిధంగా జరుగుతుందనుకోలేదు," అని కంటతడి పెట్టుకొన్నాడు.

వందరూపాయలు దొంగలపాలు ఐనవంటే పిన్ని మనస్సు విచారపూరితం కాకపోయినప్పటికీ, 'కర్మ' అని అనుకొని, అన్నయ్యమీద జాలికలగటంతో, తనకు అక్కస్సు కలిగించింది— పిన్నిలో యింత దాతృత్వానికి స్థానం వున్నదా అని.

"ఏమేం చేస్తాం? మనమీద భగవంతునికి అంత అక్కసు వుంది కాబోలు," అని "లే; అన్నం తిందువుగాని! తెల్లవారి వెళుతూ వో యాభై రూపాయలు తీసుకెళుదువుగానిలే," అన్నది పిన్ని.

అన్నయ్య హృదయం అపరిమితమైన సంతోషాన్ని పొంది, పిన్నిమీద ఒక్కుమ్మడిగా అంతులేని అభిమానం పొర్లుకొచ్చింది.

"పిన్నీ! నిజంగా నీ అంత మంచి హృదయం గల స్త్రీలు యింకా భారతదేశంలో వున్నారా!" అని సంతోషాన్ని భరించలేక అన్నాడు అన్నయ్య.

పిన్ని వంటయింట్లోకి పిలిచి అన్నం పెట్టి అవకాయపచ్చడి వేసి నేతిగిన్నె దగ్గర పెట్టింది. పచ్చడి అన్నం తిన్న తరువాత తోడుపెరుగేసి పెట్టింది.

ఎంగిలిచేయి కడుక్కొని మంచంమీద పడుకొంటూ—"పిన్నీ! మాట," అన్నాడు.

"యేమిటీ?" అన్నది పిన్ని.

"ఈ సంగతి నాన్నకు తెలీకూడదు. తెలీకుండా నన్ను విజయవాడకు పంపించాలి," అన్నాడు అన్నయ్య.

"ఎందుచేత, ఏం తెలిస్తే?" అన్నది పిన్ని.

"ఏంలేదు; కాని నన్ను పంపించి చెప్పు. యేమన్నా అంటాడని భయం." పిన్ని మాట్లాడలేదు.

తెల్లవారుఝామున అందరికంటె ముందు లేచి వరండాలోకి వచ్చి పిన్నిని లేపి — నిన్ననే నాన్నకు వచ్చిన జీతంలో 50 రూపాయలు తీసుకొని, నాన్న లేవకముందే ఆరుగంటల బండి ఎక్కి వెళ్ళిపోయాడు అన్నయ్య.

అన్నయ్య వెళ్ళాక తనకూ, పిన్నికీ అన్నయ్యను గురించి ఎందుకో అనుమానం కలిగింది. నిజంగా వందరూపాయలు పోయినవా? ఈ విషయం నాన్నకు యేవిధంగా చెప్పటం? అని.

ఎలాగైతేనేం చివరకు పిన్ని చెప్పింది నాన్నతో. నాన్న యింతఎత్తున ఎగిరిపడ్డాడు. విపరీతమైన ఉక్రోషం వచ్చింది కాని పిన్నిని యేమీ అనలేదు. అన్నయ్య అశ్రద్ధనీ, అన్నయ్యనీ కొంచెంసేపు తిట్టాడు.

అయితే నాన్న అంతటితో ఆ విషయాన్ని సద్దుమణగ నివ్వలేదు. నిజానిజాల్ని గురించి నిక్కచ్చిగా తేల్చుకురావాలనే పట్టుదల హెచ్చింది. మరునాడు శుక్రవారం కావటం మూలాన ఆ రోజు స్కూలువర్కు ముగించుకొని సాయంత్రం బండికి విజయవాడ వెళ్ళాడు నాన్న.

*　　　*　　　*

మరునాడు నాన్న రాలేదు, కారణం తెలియదు. సామాన్యంగా నాన్న పొరుగూరు వెళ్లితే ఒక్కరోజుకంటే వుండడు. అసలు ఒక్కరోజుకన్న విజయవాడలో వుండాల్సిన పనిలేదు. పిన్నికీ, తనకూ నాన్న రాకపోవడం యేదో ఒకవిధమైన యిదిని కలిగించక మానలేదు. రాత్రి పదిగంటలవరకూ రాలేదు.

తెల్లవారి వొస్తాడని పిన్ని అనుకొన్నది కాని రాలేదు. సాయంత్రం వొచ్చాడు. ఇంట్లోకి రాగానే ధుమధుమలాడుతున్నాడు. తనకి అయోమయం అనిపించింది. యేదో ఉపద్రవం సంభవించిందని పిన్ని తలచింది.

"ఏమిటండీ! ఇట్లా ధుమధుమలాడుతున్నారు," అన్నది పిన్ని నాన్నని.

"ఏమిటి? కావాల్సిందే అయింది," అన్నాడు, నాన్న దూకుడుగా.

"ఏమయిందేమిట ?" అన్నది తను.

"పుత్రరత్నం అందరికీ తలవంపులయ్యే పనులు చేస్తున్నాడు," అన్నాడు నాన్న.

"ఏం పనులు?" అన్నది పిన్ని.

ఇంకా దేనికి చెప్పుకోవడం? వాడట్లా అధ్వాన్నంగా తగలబడటానికి సహాం నువ్వే కారణం. పిన్ని మంచితనమే వాణ్ని చెడగొట్టింది. వాడు చదువుకోవాల్సిందిపోయి దోమ్మరికొంపలో డబ్బును ధ్వసం చేస్తున్నాడు."

పిన్ని నిలువునా నీరైపోయింది. తను పొందిన అక్కజానికి అంతులేదు.

నాన్న పైపంచ ఒంకెకు తగిలించి అన్నాడు. ముఖం కోపంతో ఎఱ్రబడింది. మాటలు తొందరలో తడబడుతున్నాయి.

"ఇంకా వాడు నా కంటబడలేదు. నాకంట పడించుకొానేందుకే యిన్నిరోజులు వేచివుండి, విజయవాడచుట్టూ బందరు చుట్టూ తిరగవలసి వొచ్చింది. ఇంతవరకు వాడు కాలేజీకి జీతం కట్టలేదుట; కాలేజీలో విచారించాను. అంతా ఆ భోగంముండలకే ధారపోస్తున్నాడట. బందరులోనట వీడి కాపరం. నేనిచ్చిన రెండు వందల రూపాయలు, మొన్న తీసుకెళ్ళిన యాభై రూపాయలు, చేతి రాళ్ళవుంగరం, గడియారం - అంతా ఆ బాపతుకే వొప్ప జెప్పాడట. అసలు వీడి మీద నాకు మొదట్నుంచీ నమ్మకం లేదు. నీ మూలాన వాడికి యింత డబ్బు ధారపోసి పైగా వాణ్ని చెడగొట్టినవా ణ్నయాను," అని పిన్నిమీద ఎగిరి పడ్డాడు, నాన్న.

పిన్ని కంటతడి పెట్టింది.

"వాడికోసమని, యింటికి తీసుకొద్దామని ఎంత తిరిగినా కంటబడందే. వాడి జీవితాన్ని వాడే నాశనం చేసుకున్నాడు. ఇంకా దేనికి? వాడు పనికిరాడు. ఆట్లా మట్టిలో కలిసిపోవలసిందే?"

పిన్ని అక్కడ నిలుచోలేక పోయింది. వంటయింటిలోకి వెళ్ళింది.

తనకు, నాన్న నడిగి అన్నయ్యను గురించి యింకా వివరాలు తెలుసుకోవాలనివుంది కాని అడగలేకపోయింది.

ఆ రాత్రి నాన్నకు జ్వరం వొచ్చింది. విశేషంగా తిరగడం వేడిచేసిందని నాన్న అన్నాడు. అన్నం తినలేదు; పిన్ని కాఫీ కాచి యిచ్చింది.

ఆ కాస్త జ్వరమే మర్నాడు మంటలు మండే జ్వరంలోకి దించింది. పిన్ని వైద్యుణ్ని తమ్ముడుచేత పిలిపించింది.

వైద్యుడు యింజక్షను యిచ్చి అన్నం పెట్టవద్దని చెప్పి వెళ్ళాడు. పోనీ నాన్న మనసు స్థిమితంగా వుందా అంటే అదీ లేకపోవటమువల్లే—అన్నయ్యను గురించి వున్న బాధ అపరిమితం కావటమువల్ల—నాన్న పరిస్థితి విషమించింది.

"ఇంకారాలేదా యింటికి? రానీ వాడి పని చెబుతాను. ఏదో వొకటి అంతుతేల్చుకుంటాను. చదవటమో తిరగటమో! ఇంకా ఎక్కడ వాడు చదివేది ?" ఈ విధంగా నాన్న మాటిమాటికీ అన్నయ్యమీద రోషపడడమూ, పిన్ని వారించడమూ జరుగుతున్నది.

అన్నయ్యను గురించి చెడ్డవార్త విన్న తరవాత తను పిన్నిలోని మార్పు గమనించలేక పోయింది. అన్నయ్యను గురించిన ప్రసక్తి మానివేసింది. తను కదిలించి చూసినా యేమాత్రం మనసులోని అభిప్రాయాన్ని బయట పెట్టలేదు. అప్పుడప్పుడు నాన్నతో పిన్ని అనే మాటల్ని బట్టి పిన్నికి అన్నయ్య మీద కించిత్తు సదభిప్రాయం వున్నట్టే తను గ్రహించగలిగింది, కాని ఆ సదభిప్రాయం ఎందువల్ల ఇంకా ఇంత రాద్ధాంతం జరిగిన తరువాత కూడా వుంచుకోగలిగిందో అర్థం చేసుకోలేకపోయింది తను. ఉంచుకోవడంలో, అంతరంలో యేమీ కల్మషం లేనట్లే అయితే నిజంగా పిన్ని గొప్ప ఉన్నతభావాలుగల, ఉదార స్త్రీ కావాలి.

నాన్నకి జ్వరం నయంకాలేదు. ఆ జబ్బు కొడుకునుగురించి వున్న దిగులుతో మరీ దుర్భరస్థితికి వచ్చింది. అన్నయ్య రాలేదు, జాడ తెలీదు.

నాన్నకి టైఫాయిడ్ జర్వమని డాక్టరు చెప్పిన రోజున పిన్నీ, తనూ అధైర్యపడినారు, అన్నయ్యకు ఈ విషయమై తను

వుత్తరాలు వ్రాసింది. జవాబులేదు. అన్నయ్యా రానూలేదు; నాన్న యింట్లో జబ్బులోవుండగా అప్పులవాళ్ళు వెంటబడ్డారు. నాన్న ఒక యకరం పొలం అమ్మేయమని పిన్నికి సలహా ఇచ్చాడు. యకరానికి సరిపోను అప్పు లున్నవి. పిన్నికి యేపని చేయటానికీ కాలూచేయీ ఆడలేదు. నాన్న పరిస్థితి విషమించింది. అప్పులవాళ్ల గోల అధికంగావుంది. అన్నయ్యా యింటి ముఖం చూడలేదు.

ఆ రాత్రి నాన్న చనిపోయాడు. పిన్ని సత్తువకొలదీ యేడ్చింది. పిల్లలు కుమిలి కుమిలి యేడ్చారు. తను పడమటింట్లో కూచోని కుళ్లికుళ్లియేడ్చింది. అన్న కోసం విజయవాడ వెళ్ళిన మనిషి అక్కడన్నయ్యా లేడని తెల్లవా రొచ్చాడు.

శవాన్ని ఆ పళంగా ఎట్లా అట్టేపెడతారు? తమ్ముడి చేత తలకొరివి పెట్టించారు.

చిన్న కర్మ జరిగిన నాలుగో రోజు రాత్రి అన్నయ్యా వచ్చాడు. నిశిరాత్రిన తలుపు కొట్టాడు. తను వెళ్ళి తలుపు తీసింది. పిన్ని తెగ ఏడుస్తూంది. ఈ సంసారాన్ని ఎట్లా ఒడ్డెక్కించాలని. అన్నయ్యా చిక్కి సగమైపోయాడు. శరీరమంతా మలమల మాడిపోతూన్నది. కళ్ళు నిప్పుకణాల్లాగ ఎర్రగా వున్నవి. గుడ్డలు మాసివున్నవి. పిన్ని నిద్రపోలేదు.

అన్నయ్యా బలవంతాన మంచంమీద కూలబడ్డాడు. పిన్ని మంచం మీదనించి లేచింది. తను అన్నయ్యా వంక చూస్తోంది. మాటలు లేవు. వాతావరణం అతి నిశ్శబ్దంగా వుంది. లోపల హృదయాల్లో నిప్పులు రగులుతున్నయ్, కోపం రూపంలో.

"అప్పుడే వొచ్చావేం?" అన్నది తను, అక్కసునంతా వెళ్ళబోస్తూ.

"ఆఁ! ఇప్పుడే—చావలేక యిటు వచ్చాను; చావడానికి మరో ఉపాయం స్థిమితంగా ఆలోచించుకుందామని," అన్నాడు అన్నయ్య, విసుగ్గా.

"అన్నాయ్," అనలేక అనలేక అన్నది పిన్ని.

అన్నయ్య చివ్వున లేచి పిన్ని పాదాలు పట్టుకొని "పిన్నీ! నన్ను క్షమించు. నాన్న చనిపోవటానికి నేనే కారణం. ఈ కుటుంబానికి నాశనం తెచ్చాను; నేనే. నాలో యేదో రాక్షసత్వం ఆవరించింది. అష్టవంకరుల పనులు చేశాను. చివరకు నాన్నకు తలగొరుగుకూడా పెట్టలేదు. ఇప్పుడు నాలో పరివర్తన కలిగింది. తిరిగి చూసుకుంటే నీ ముఖం చూడటానికి మనసు చెల్లక రైలుకింద పడదామని వెళ్ళితే ఆ పని సాగలేదు. ఇక యింటికి వొచ్చాను," అన్నాడు.

పిన్ని కార్చిన వేడినీళ్ళు అన్నయ్య శిరస్సుమీద పడ్డాయి, అన్నయ్య కార్చిన కన్నీళ్ళు పిన్ని పాదాలమీద పడ్డాయి. అన్నయ్య-పిన్ని హృదయాలు బాధలతో క్షణంసేపు నిర్మలాలైనై. పిన్ని అన్నయ్యను లేవనెత్తింది. అన్నయ్యమీద పిన్నికి జాలి మిక్కుటంగా వేసింది. పుత్రవాత్సల్యం గతంలో చేసిన తప్పుడుపనులన్నింటినీ మరుగు పరచింది."అబ్బాయి! ఇదంతా నా కర్మ, నా స్వయంకృతం అయినా నేను విచారించటంవలన ప్రయోజనం యేమీలేదు. ఈ కుటుంబానికి మైలురాయివంటి మీ నాన్న గతించారు. కుటుంబభారం నీ మీదనే ఉంది. ఈ పిల్లల్నీ, నన్నూ నీవు యేంచేసినా చేయవొచ్చు. నేను సాధ్యమైనంత వరకూ నా పిల్లలకంటే కూడా మీరు సవతి పిల్లలైనప్పటికీ నిన్నూ, అమ్మాయినీ చాల ప్రేమగా, అభిమానంగా పెంచి, నీకు చదువు చెప్పించటానికి కారకురాల నైనాను. కాని

నీవు ఆ విశ్వాసాన్ని వుపయోగించుకో లేక చివరకు వక్ర మార్గాలలో నడచి కుటుంబాన్ని దుఃఖాబ్ధిలో ముంచావు మళ్ళీ తిరిగి కుటుంబాన్ని సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పురుషుడవైన నీ పైన వుంది. ఈ కుటుంబాన్ని తుదివరకూ నీట ముంచినా, పాల ముంచినా నీ ప్రవర్తననుబట్టే ! పదిహేడేళ్లు పెరిగిన నీ చెల్లెలు వివాహం కాక అట్లానే వుంది," అన్నది, పిన్ని బాధ్యత నంతా అన్నయ్యకు వొప్పజెప్పి.

"అదీకాక కుటుంబ ఖర్చులకు గాను, నీ చదువుకుగాను ఆదాయమూ, సంపాదనా చాలక మీ నాన్నగారు చేసిన అప్పు మూడువేలవరకూ వుంది. దాన్ని పొలం అమ్మి తీర్చే బాధ్యత నీది," అని కూడా అన్నది పిన్ని.

ఈ బాధ్యత అన్నయ్యకు వొప్పజెప్పి పిన్ని తొలగటం తనకు నచ్చలేదు. నాన్న చనిపోయిన దగ్గర్నుంచీ పిన్నిలో గాంభీర్యం అధికమైంది. మాట్లాడటం తక్కువ. పిల్లలపోషణ తనే చేయవలసి వొస్తూంది.

అన్నయ్య నాలుగెకరాలూ అమ్మేశాడు, పిన్ని సలహా లేకుండానే. ఇంకొక సెంటు పొలంలేదు. పిన్ని కలవర పడింది. అంతా ఎందుకు అమ్మేశావని అడిగింది. అందుకు అన్నయ్య అన్నాడు: "అసలు యిక్కణ్నుంచి కాపురం ఎత్తివేదాం. ధరొస్తే యిల్లు కూడా అమ్మేసేదాం. ఈ డబ్బంతా పెడితే పదిహే నెకరాల పొలం వొస్తుంది, నైజాంలో. అందరమూ అక్కడ వుందాం. నేను యేదో ఒకవుద్యోగంచేస్తూ పొలం చేయిస్తూంటా.

"మనకు బ్రతకటమే కావాల్సింది. ఇక్కడైతే నాకు యాభై రూపాయల జీతం కూడా రాదు. అక్కడ సికిందరాబాద్‌లో నెలకు నూటయాభై రూపాయల జీతంవరకూ సంపా

దించుకోవొచ్చు. కుటుంబమూ గడుస్తుంది. ఎప్పుడైనా మంచి లాభాలు సంపాదించుకున్నప్పుడు ఇక్కడకు రావొచ్చు," అని అన్నాడు అన్నయ్య.

కాని ఇది పిన్నికీ, తనకూ నచ్చలేదు. అక్కడ వాతావరణం బాగుగాలేదనీ, ప్లేగువ్యాధి అధికమనీ, మలేరియా వ్యాధి పిలిస్తే పలుకుతుందనీ—యేకాడి కొకకాడికి యిక్కడే వుండటము వుత్తమ మనీ. అక్కడికి వెళ్ళినవాళ్ళు తిరిగి ఒస్తున్నారనీ అనుకుంటూంటే పిన్ని విన్నది. ఈ విషయమే అన్నయ్యకు చెప్పింది పిన్ని. అన్నయ్య అదంతా శుద్ధ అబద్ధం అన్నాడు. ఏమైనా మనం అక్కడకు - కానిదేశం పోవద్దని పట్టు పట్టింది పిన్ని. అన్నయ్య సరే వెళ్ళవద్దని అన్నాడు. ఊళ్ళో అప్పులన్నీ తీర్చాడు. మిగిలిన డబ్బుతో చవకలో మూడు నాలుగు ఎకరాలు ఆవూళ్ళోనే వొచ్చేట్టు కొంటానని పిన్నికీ, తనకూ ధైర్యం చెప్పాడు.

ఉన్నట్టుండి ఒక రోజు అన్నయ్య కనపడలేదు. పొలం అమ్మిన ఆరువేల రూపాయలు తీసుకెళ్ళాడు. పిన్నీ, తనూ, గోడుగోడున యేడ్చితే మట్టుకు యేం లాభం ?

రోజులు, వారాలు, నెలలు గడిచినా అన్నయ్య అంతులేదు. కుటుంబం జరగటం లేదు. పిన్ని పిల్లల్ని తీసుకొని పుట్టింటి కెళ్ళింది. తనని కూడా రమ్మని బ్రతిమాలింది. తను ఏ ముఖం పెట్టుకొని పిన్నిగారి పుట్టింటి కెళుతుంది ? తను స్వంతఇంట్లోనే వుంటి, రాత్రులు ఇంట్లో దీపం పెడుతూ. తను బ్రతికే దెట్లా?

ఎట్లాగో ఒక విధంగా ప్రస్తుతం తను ఒక్కతే బ్రతుకుతున్నది ఆ యింట్లో.

(సమీక్ష)